



# 'ఎదుటి వారికి చెప్పేటందుకే...'

— వలివేటి నాగచంద్రావతి

ఉదయం ఎనిమిది గంటలవటానికి ఇంకో పావు గంట వ్యవధి ఉంది. పిల్లల్ని స్కూళ్లకీ మొగుణ్ని ఆఫీసుకీ తయారుచేసి పంపాల్సిన గృహిణి ఆ సమయంలో ఎంత తీరుబాటుగా ఉంటుందో నేనూ అంతే తీరిగ్గా ఉన్నాను.

రెండో విడత కాఫీ కోసం హెచ్చరికమీద హెచ్చరిక చేస్తున్నారు నాపతి దేవులు. షేవింగ్‌సెట్ ముందు పెట్టుకుని మగ్గుతో నీళ్లు తెచ్చిపెట్టమని గావుకేకలేస్తున్నాడు నా పుత్రరత్నం, కాలేజ్ కెళ్లేలోగా ఎల్లాగైనా సరే వీల్లేనుకుని తన ఆర్గండీ చీర ఇస్త్రీచేసి పెట్టెయ్యమని చెవి దగ్గర మహపోరు పెట్టేస్తోంది నా పుత్రికామణి. స్కూల్‌నించి రాగానే హోమ్‌వర్క్ చేసుకోరా అంటే నసేమీ వినకుండా, సాయంత్రమంతా ఆట్లాడి ఇప్పుడు హడావిడిగా పుస్తకాలు ముందేసుకుని రానిలెక్కేదో నన్ను చెప్పమంటూ వెనకెనకే తిరుగుతూ వేధిస్తున్నాడు- పొరపాటున ఎక్స్‌ట్రాగా పుట్టిన నా గారాల చిన్న కొడుకు.

అంట్లకి వేసిన సబ్బుపొడి చాల్లేదని సనపెట్తోంది మా పనిమనిషి. పావుశేరు కందిపప్పు బదులుకువచ్చి పావుగంటనించీ సుత్తి వేస్తోంది మా పొరుగింటి మహలక్ష్మి.

ఒక చేత్తో కాఫీ, మరో చేత్తో నీళ్లమగ్గూ అందించేసి, ఒక వక్క స్టౌమీద కూరకి తిరగమోతపెట్టి, రెండో దాని మీద ఇడ్లీకుక్కరు ఎక్కించి, డైనింగ్ టేబిల్‌మీదే ఇస్త్రీకి సమాయత్తం చేసి, పనిమనిషిని సంతృప్తి పరిచి, మొహాన నవ్వతికించుకుని మహలక్ష్మికి ఊకొడుతూ, ఓ వంక చీర ఇస్త్రీచేస్తూ ఓ వంక మావాడి ప్రోబ్లమ్ ఎలా సాల్వ్ చెయ్యాలో వివరిస్తూ, అలవోకగా అష్టావధానం చేస్తున్నాను నేను.

అలాటి సమయంలో వీధిలోకేక- "గులాబి అంట్లమ్మా- గులాబి అంట్లు" అని.

అంత సనిరద్దీలోనూ నా వీనులకాకేక రణగొణధ్వనుల మధ్య మురళీరవంలా వినిపించటానిక్కారణం- నాకు మొక్కలు పెంచటం సరదా. ముఖ్యంగా గులాబీ లంటే ప్రాణం.

మొన్న మొన్నటిదాకా రెండో అంతస్తులో రైల్వే కంపార్టుమెంటు లాంటి చిన్న వాటాలో అద్దెకుండేవాళ్లం.

పూల మొక్కలు కాదు సరికదా తులసికోట పెట్టుకుందుగ్గూడా జాగాలేదు అక్కడ. రెళ్లెల్ల క్రితం ఈ ఇంట్లోకి గృహప్రవేశమయ్యేం.

కొత్తగా కడ్తున్న మధ్యతరగతి కాలనీ ఇది.

మావారి ఆఫీసు వాళ్లంతా ఓ సొసైటీగా ఏర్పడి కూడేసిన అందరి స్వేద ఫలితాన్నీ పోగేసి, ఊరికి దూరంగా ఉన్న కొంత భూమిని కొనుగోలు చేసి, సదరు ఆఫీసు యాజమాన్యం వారికి అర్జీలు పెట్టుకుని, వాళ్లు దయతో సాంక్షన్ చేసిన లోన్‌తో ఈ బుల్లి బుల్లి కుటీరాల్లాంటివి వేసుకున్నాం.

ఇల్లు సామాన్యంగా ఉంటేనేం- అది పూర్తిగా మా సొంతం. అదీ తృప్తి. ముఖ్యంగా నాకు ఈ ఇల్లలో నచ్చిన అంశం చుట్టూరా బోల్డు ఖాళీ స్థలం ఉండడం. నా కరువు తీరా ఎంత తోటైనా పెంచుకోవచ్చు.

ఇప్పటికే మా పిల్లలు పెరట్లో ఆకు కూరల విత్తనాలూ, కాయగూరల విత్తనాలూ మళ్లు గట్టి చల్లారు.

నందువైపు వడగ్గది దగ్గర నైట్ క్వీనూ, వీధివైపు ప్రహరీగోడ దగ్గర పారిజాతాలూ, పొద్దుతిరుగుడు మొక్కలూ మా అమ్మాయి ఎక్కణ్నించో సంపాదించి పాతేసింది.

ఇక మెట్ల దగ్గర్నించి గేటుదాకా రబ్బిష్‌పోసి లెవెల్ చేసిన దారికి రెండు వక్కలా గులాబి అంట్లు నాటడానికి నాకోటాగా ప్రత్యేకించి ఉంచుకున్నాను నేను.

-'నర్సరీకి వెడితే రేటెక్కువ. వాకిట్లోనే అమ్మొస్తాయి చవగ్గా'. అని ఇరుగు పొరుగు వాళ్లంటే అప్పట్నించీ ఎదురు చూస్తున్నాను. ఈ కేక కోసం.

మంచి పనివేళ. అయినా తప్పదు.

ఎక్కడవని అక్కడ అట్టిపెట్టి, మహలక్ష్మిని సాగనంపి ఆదరాబాదరా వాకిట్లోకి వచ్చాను. అప్పటికే వాడు నాలుగిళ్లు దాటేశేడు. మా చిన్నాడు పరిగెత్తికెళ్లి వాణ్ని వెనక్కి పిల్చుకొచ్చాడు. కావిట్లో రెండు గంపలనిండా చిన్నచిన్న కుండీల్లో ఉన్నాయి మొక్కలు. కొన్ని మొగ్గలతోనూ, కొన్ని పువ్వులతో కూడానూ వచ్చగా కళకళ్లాడుతూ నా కళ్లవిందు చేసేయి.

"పసుపు ఎరుపు, తెలుపు, గులాబీ అన్ని రంగుల గులాబీ రకాలూ ఉన్నయ్యమ్మా. ఏవికావాలో చూసుకోండి". అన్నాడు వాడు తలగుడ్డ దులిపి మళ్లీ చుట్టుకుంటూ.

"ఎంత చెబుతున్నావు?" ఒక్కక్క మొక్కనే పరీక్షగా చూస్తూ అడిగాను.

"ఆ ఎరుపువీ, తెలుపువీ అయిదేసినీ- మిగతాటివన్నీ పదేనేసినమ్మా-"

"ఏవిటీ రూపాయిలా- చిల్లపెంకులా-?" వరండాలో పడక్కుర్చీలో తీరిగ్గా పేపరు తిరగేస్తున్న మా వారు లేచి దిగివస్తూ చమత్కారంగా ప్రశ్నించారు.

"రూపాయిలే బాబయ్య- చిల్లపెంకులకి విలువేముంది-" నూటిగానే చెప్పాడు వాడు.

"ఆరేటికి అమ్ముదామనే బయల్దేరావా?" గదమాయించారు మావారు.

"అమ్ముదామని కాకపోతే భుజాన బరువెందుకు మోస్తాను బాబయ్య- సరదాగా-?" మర్యాదగానే మాటకి మాట సమాధానమిచ్చాడు వాడు.

"మరయితే ఇచ్చే ధర చెప్పు" దారికి వస్తూ అడిగారు.

"నేను చెప్పాను గదా బాబూ- ఇక మీరే అడగండి" అన్నాడు వాడు.

"రెండూ కలిపి ఎనిమిది"

మావారు బేరమాడ్డంలో ఎక్స్‌పర్ట్, కిందా మీదా పెట్టి వాడింకెవ్వరికీ ఇవ్వని రేటుకి దింపేయటంలో సిద్ధహస్తులు.

నేనిక అక్కడుండటం అనవసరం. వాళ్లబేరం తేలేసరికి ఎంతలేదన్నా పావుగంట పడుతుంది.

నేను లోపలికి వెళ్లిపోయి కారియర్లు సర్ది, పెద్దాడికీ, చిన్నాడికీ టిఫెన్ పెట్టి, అమ్మాయిని స్నానానికి పంపి మళ్లీ బయటకు వచ్చే వేళకు వాడు అయిదు రూపాయలు చెప్పిన మొక్కల్ని మూడుకీ, పదిహేను చెప్పిన వాట్లకి ఎనిమిదికీ కుదించటంలో కృతకృత్యులై విజయదరహాసంతో, "ఏవేవి కావాలో ఎంచుకో" అన్నారు మావారు.

మళ్లీ మళ్లీ ఇటువంటి అవకాశం రాదన్నట్టు రంగుకొకటి చొప్పున ఓ అరడజను పక్కకి తీసిపెట్టాను.

డబ్బు లెక్క చూసి జేబులో పెట్టుకుని కావడి భుజాన ఎత్తుకుంటూ, "సాయంత్రం చల్లబడ్డాక తీసి వేరేగా నాటు కోండమ్మా. ఇప్పుడు పాతితే ఎండకి వడిలి పోతాయి" సలహా ఇచ్చాడు వాడు.

"సరేలే ఇప్పుడు మొక్కలకి గోతులు తవ్వు కుంటూ కూర్చునే ఖాళీ కూడా లేదులే" అని సమాధానం చెప్పి లోపల వదిలి పెట్టేసిన పనులు గుర్తుకు వస్తుంటే మరోసారి తీసుకున్న మొక్కలకేసి తృప్తిగా చూసి లోపలికి వచ్చేశాను నేను.

మళ్లీ బిజీగా పనిలోకి జొరబడిపోయి పదినిమిషాలు- అవును- సరిగ్గా పది నిమిషాలన్నా గడిచిందోలేదో, మా అమ్మాయి "అమ్మోయ్ నీ గులాబంట్లు మటాష్- చిన్నా ఆ కుండీలు బద్దలు కొట్టేశాడోచ్..." అంటూ పరమోత్సాహంతో రొప్పుకొంటూ పరిగెట్టుకొచ్చింది.

ఆఖరివాడని చిన్నాని నేను కాస్తగారం చేస్తానని దానిక్కాస్తగుర్రు. వాళ్లిద్దరికీ క్షణం పడదెప్పుడూ.

ఇహను వాడొచ్చేస్తాడు- ఉరకలేసుకుంటూ "అంతా ఉట్టిదే నమ్మా. నేను పగలకొట్టలా- అక్కేన్ను వాట్లమీదికి తోసేసింది", అంటూ ఏదో ఒకటి తన తప్పు కప్పెట్టుకొందుకు కల్పించేస్తూ వచ్చేస్తాడు.

ఇంతకూ ఆ మొక్కల్ని ఏం నాశనం చేశాడో ఏమిటో వెధవ. అనుకునేంతలో వాడు రానే వచ్చాడు. కానీ నేననుకున్నట్టు తప్పు కప్పిపెట్టుకుంటూ కాదు-

"మోసం... మోసం పాతిక రూపాయలు టోకరా" అంటూ ఏదో కనిపెట్టేసిన కొలంబస్‌లా కళ్లు మెరిపిస్తూ.

నేను వాడి చెవ్వందుకున్నాను. "దుడుకు వెధవా. వాట్ని తగలపెట్టింది చాలక మళ్లీ ఆ అరుపులేమిటి" అన్నాను కోపంగా.

"అదికాదమ్మా అంతా దగా అంటే వినవేం. రా నువ్వే చూద్దూగాని-" నానించి చెవ్వు విడిపించుకుని ఆ చెయ్యి పట్టుకు లాక్కుపోయాడు వాకిట్లోకివాడు. అక్కడ కళ్లబడిన దృశ్యం ఏమని చెప్పను.

ఒక్కొక్క కుండీ ధమాల్మని వగలగొట్టేస్తున్నాడు మా పెద్దవాడు సీరియస్‌గా. వాట్లో ఉండే మట్టంతా పెళ్లగించి పరీక్ష చేసేస్తున్నారు మా శ్రీవారు.

"అయ్యో అయ్యో అదేం పనండీ అలా మట్టి విడదీస్తే మొక్కబతకదండీ" లబలబలాడుతూ దగ్గరకు పరిగెత్తేను నేను.

"విడదియ్యక పోయినా ఇవి బతకవులే" తాపీగా అంటూ పక్కనపడేశారు వాటిని మావారు.

"అదేవిటండీ" నా ఆత్రం.

"విరిచిన కొమ్మలకి వేటివేళ్లో చుట్టి ముంతల్లో పెట్టుకొచ్చాడు వెధవ." కొమ్మకి కొమ్మా వేళ్లకి వేళ్లూ వేరే వేరే తీసి చూపించారు మావారు.

నిర్ఘాంతపోయాన్నేను.

మా పెద్దాడు చటుక్కున పర్టు వేసుకొచ్చాడు.

"వాడెళ్లి పది నిమిషాలు కాలేదు. ఎక్కడికిపోతాడు. ఈ చుట్టుపక్కలే ఎక్కడో ఉంటాడు. దొంగ వెధవని లాక్కొస్తానుండు" అంటూ సైకిలేసుకుని రివ్వున వెళ్లాడు.

ప్చ్. టోపీ పెట్టెళ్లిన మోసగాడు చుట్టుపక్కల తారాట్లాడుతాడా, మనపిచ్చిగానీ అనుకున్నాను గానీ-

మావాడు అసాధ్యుడే. అన్నట్టుగానే సాధించుకువచ్చాడు. ఎక్కడ పట్టుబడ్డాడోగానీ పావుగంట తరవాత ఆ మొక్కల వాణ్ని చొక్కాపట్టుకు దాదాపు ఈడ్చుకొచ్చాడు. ఆ తరవాత జరిగిన ఆగం, అల్లరీ చెప్పతరం కాదు.

మావాళ్ల అరుపులకీ, వాడి దీనాలాపాలకీ చుట్టుపక్కల వాళ్లందరూ మోళీవాడి డప్పు శబ్దం విన్న పొరుల్లా బిలబిల్లాడుతూ మా ఇంటి ముందు గుంపుగూడి పోయారు.

మావారు గొంతు పెంచి మహావేశంతో వాడు చేసిన దురాగతాన్ని గులాబి కొమ్మలూ వేళ్ళూ ఎత్తిచూపిస్తూ సాక్ష్యాధారాలతో వాళ్లకి వివరిస్తోంటే మా పెద్దవాడు వాడిమీద ముష్టిఘాతాలతోకాలితాపులతో వీరావేశం ప్రదర్శించసాగేడు.

చుట్టూ మూగిన ప్రేక్షకులు కూడా మావాళ్లకే సపోర్టు ఇస్తూ రకరకాలవ్యాఖ్యానాలు చేయసాగేరు.

"ఇలాంటి ముం... కొడుకుల్ని తేలిగ్గా వదలకూడదండీ. తీసికెళ్లి పోలీస్ స్టేషన్లో అప్పగించి రండి" అని ఒకరూ, "మళ్లీ జన్మలో మర్చిపోకుండా ఏ చెయ్యోకాలో విరిచి పంపించండి" అని మరొకరూ సలహాలు పారేస్తున్నారు.

ఇంకొందరు, "ఒకసారిలాగే..." అంటూ గడచిన గాథల్ని తవ్విపోసేస్తున్నారు- సమయం దొరికిందే చాలని.


మరికొందరు ఉత్సాహవంతులు ఇంకాస్త ముందంజవేసి తమ చేతుల్లోనూ వాణ్ని టపటప వాయగొడుతూ శౌర్యాన్ని చాటుకోవడమేకాక, "కొట్టండి- చంపండి- మక్కెలిరక్కొట్టండి" అంటూ వీరాలాపాలతో మా వాళ్లని పోత్సహిస్తున్నారు. దాంతో ఇంకొందరు వాళ్లతో జతకలుస్తున్నారు. పాతిక రూపాయలు నష్టపడిన అక్కసు లోపల పనిచేస్తున్నా వాణ్ని అంతలా కొట్టడం సమంజసమనిపించలేదు నాకు.

నేను వాళ్లని వారించబోయేను కానీ- లోకంలో ఉన్న చెడునంతా కడిగేసే ఉద్యమాన్ని అప్పుడే చేపట్టిన వారిలా ఉద్రేకంతో పూనకమొచ్చినట్టు ఊగిపోతూ నన్నసలు పట్టించుకోలేదు ఎవరూ. మా వాళ్లయితే విదిలించేశారు కూడాను.

పాపం- ఆ కాస్సేపటిలోనే మొక్కలవాడి చొక్కా చిరిగిపోయింది. పంచపేలికలయింది. పెదవి చిట్లింది. ఒక కన్నూ చెంపలూ వాచిపోయేయి.

వాడు తనని తన్నేవాళ్ల కాళ్లు పట్టుకుంటున్నాడు. "తప్పయి పోయిందయ్యా ఇంకెప్పుడిలాంటి తప్పుడు పనులు చెయ్యనయ్యా." అని చెంపలు వేసుకుంటున్నాడు. "నన్నొదిలి పెట్టండని" వేడుకుంటున్నాడు.

వాడి దీన స్థితికి నామనసయితే కరిగి నీరయింది. పట్టనట్టుగా ఊరుకోటం నా సాధ్యంకాలేదు. సంకోచం వదిలేసి అందరి మధ్యకీ మళ్లీ వెళ్లాను. ఎంతో ప్రయత్నంమీద వాళ్ల చేతుల్నించి వాడిని



తప్పించాను.

ఏదో లాగున వాళ్లందర్నీ చల్లబరిచి వాడిని విడిపించి పంపేటప్పటికి తాతలు దిగివచ్చారు. చివరన వాడి జేబులోంచి మా డబ్బు ఊడలాక్కోవటం మరిచిపోలేదు సుమా! ఎటువైపు వాళ్లటు వెళ్లిపోయారు. పెద్ద గాలివాన వెలిసింది.

ఇంట్లోకి వచ్చేసినా ఆ సంఘటన సృష్టించిన కల్లోలాన్నించి చాలా సేపటివరకూ తేరుకోలేకపోయాను. ఏదో గిల్టీ ఫీలింగు పీడిస్తోంటే అన్యమనస్కంగానే ఉండిపోయాను.

పొట్టకూటికోసరం ఓ పేదవాడు ఏదో కాస్త కక్కుర్తి పడ్డాడే అనుకుందాం. దానికింత మంది ఇంతలా రియాక్టయిపోయి అంతసేపతన్ని నిర్దాక్షిణ్యంగా దండించటం సబబా?

ఈ మాటని మావారితో అనకుండా ఉండలేకపోయాను.

ఆఫీసుకు తయారవుతూ ఆదరాబాదరా మాలేసు బిగించుకుంటున్న మా శ్రీవారు నావంక అజ్ఞానిని చూసినట్టు చూశారు. ఆ తర్వాత ఏదో గొప్ప సందేశాన్నందించబోయేలా గంభీరులయ్యారు.

"చూడూ నేరాన్ని క్షమించటమంటే నేరాన్ని సమర్థించటమే; ప్రోత్సహించటమే, అది ఎంత ప్రమాదమో తెలుసునా! నీకు ఈ మనుషుల మనస్తత్వం గురించి ఏమీ తెలీదు. ఓ తప్పుని చిన్నదే లెమ్మని చూసీ చూడనట్టుండి పోయేమనుకో- లేకపోతే తూకంవేసి మందలింపుతో సరిపెట్టామనుకో- తప్పు చేసినవాళ్లు దాన్ని దయాదృష్టికింద తీసుకోరు- చేతకాని తనం కింద లెక్కవేసి మన్ని అలుసుచేస్తారు. వీళ్లేం చెయ్యలేరనే ధైర్యంతో ఆ తరవాత విజృంభించి పోయి ఆ తప్పునే మళ్ళీ మళ్ళీ చెయ్యటానికి వెరవరు. ఇంకా ఘనమైన తప్పుల్ని కూడా బెరుకు లేకుండా చేయడానికి సాహసిస్తారు.

అంచేత నేరగుణాన్ని అణిచెయ్యటానికి ఎప్పుడూ దండాన్నుపయోగించాల్సిందే. దోషిని శిక్షించాల్సిందే. బుద్ధివచ్చేలా చీల్చి చెండాడాల్సిందే "అని చాలా'ఓపిగ్గా జ్ఞానబోధ చేసేరు. ఆయనగారి వాదనని అవుననిగానీ కాదనిగానీ అనలేదు నేను- మౌనంగా ఉండిపోయేను. ఆయన్ని వెళ్లనిచ్చి తలుపు వేయబోతోంటే నేలబడిన గులాబీ కొమ్మలు వడిలి నిస్సహాయంగా అవుపించాయి. ఆశచావక గోడవారంటే వాటిని గుచ్చి కాసిన్ని నీళ్లు చిలకరించాను.

★ ★ ★

వారం గడిచింది.

ఆ రోజు రాత్రి - అప్పుడే మా భోజనాలు పూర్తయ్యాయి. నేను నింపాదిగా వంటిల్లు సర్దుతున్నాను. 'నోట్లో మెతుకు- గూట్లో దీపం' అన్నసామెతగా మా ఎక్స్‌ట్రా అప్పుడే మంచమెక్కి ముసుగుతన్నేశాడు. మా అమ్మాయి హాల్లో కూర్చుని బోటనీ రికార్డులో గావున్ను బొమ్మలేస్తోంది. మా పెద్దాడు కూడా అక్కడే టేబుల్ లైట్ దగ్గర లెక్కలతో కుస్తీ పడుతున్నాడు.

మావారు మాత్రం వీధి వరండాలో అలవాటుప్రకారం పచార్లు చేస్తున్నారు. పాలలో తోడంటు వేస్తున్న నాకు ఎవరో గేటు తీసుకునొచ్చి మావారితో మాట్లాడుతున్న అలికిడి వినిపించింది.

'సరే చుట్టమయితే లోపలికే వస్తారుకదా- ఆయన ఫ్రెండ్స్ అయితే మాట్లాడి వెళ్లిపోతారు. ఇంక రాత్రిపూట కాఫీలు పెట్టే పనికూడా ఉండదు.'

అని నేనట్టే పట్టించుకోలేదు మొదట.

కానీ రానురానూ వచ్చిన వారి గొంతులు పెరుగుతున్నాయి. దాంతోపాటు మావారి కంఠస్వరం కూడా తారాస్థాయినందుకుంటున్నది.

నా భృకుటి ముడివడింది. అనుమానంగా మా పెద్దాడికోసం తొంగిచూశాను. ఎప్పుడు పక్కఎక్కాడో- ముడుచుకుని నిద్రనటిస్తున్నాడు వాడు. మా అమ్మాయి బొమ్మలు వెయ్యటం ఆపేసి భీతహరిణిలా దిక్కులు చూస్తోంది.

నేను చప్పున వీధిగుమ్మం దగ్గరకు వచ్చినిల్చున్నాను. వచ్చినవాళ్లు ఇద్దరు. ఒకతనికి ముప్పయి ఏళ్లకిపైన ఉండవచ్చు. ఇంకొకతను ఇరవై ఏళ్లు దాటిన కుర్రాడు.

నేను వాళ్ల సంభాషణ వింటూ విషయాన్ని ఆకళింపు చేసుకునే ప్రయత్నం చేయసాగేను.

"చెయ్యని పాపాన్ని నెత్తినెందుకేసుకుంటాడయ్యా కాదనే చెప్తాడు. ఏం చేస్తావేం?" బింకం వదల్లేదు మావారు.

"ఏం చేస్తానా- కీళ్లు విరగ్గొట్టిమరీ ఒప్పిస్తాను. వాళ్లు చెట్లంటా గుట్లంటా ద్యూయట్లు పాడ్డం వెయ్యి మంది చూశారు- వీధిలో కీడ్చి వాళ్లందరిచేతా ఉమ్మేయిస్తాను. రెచ్చిపోయాడతను.

"ఇదిగో - ఇదిగో ఊరుకుంటుంటే పేట్రేగిపోతున్నావ్- మా ఇంటికొచ్చి మా మీదే దౌర్జన్యం చేస్తావా? ముందు నా గుమ్మందాటి మాట్లాడు." మావారు మండిపడుతూ గేటు వైపు వేలెత్తిచూపించారు.

"నువ్వుండరా" పెద్దతను చిన్నతన్ని ఒక్కడుగు వెనక్కినెట్టి ముందుకొచ్చాడు. "చూడండి మూర్తిగారు! మా తమ్ముడిది తొందరపాటే, మీరు పది మందిలో ఔననిపించుకుంటున్న పెద్దమనుమలు.



నిజానిజాలేమిటో రెండు వైపులా పరిశీలించి న్యాయం చేస్తారనే ఆశతో అర్థించటానికొచ్చాం గాని దౌర్జన్యానికి కాదు. మీరు మా పరిస్థితి గమనించండి. మేమూ సంప్రదాయంకల కుటుంబీకులమే. దారి తప్పినడిచింది మా చెల్లెలూ మీ అబ్బాయి ఇద్దరూ కలిసే అయినా అల్లరయింది మాచెల్లెలు. తలవంచుకున్నది మేమూను. మీకు ఆడపిల్ల ఉంది. పెద్ద మనసుతో పక్షపాతం లేకుండా పరిష్కారం చెప్పండి దయచేసి" అంటూ మావారి చేతులు పట్టుకోబోయేడు.

ఆ సందివ్వలేదు మావారు. "అయితే ఏమిటంటావయ్యా? మీకు పడ్డ మచ్చని ఏపాపం పుణ్యం ఎరగని మాకు అంటిస్తానంటుంటే మహా ప్రసాదమంటూ దోసిలొగ్గమంటారా? అసలు తల్లీతండ్రీ మాటున కుదురుగా ఉండాల్సిన ఆడపిల్ల తగుదునమ్మా అని అదుపు లేకుండా వయ్యారాల్ని వీధిలో ఆరబోస్తే మా అబ్బాయేనా- ఇంకెంత మంది చెయ్యేసేరో- మీరు మాత్రం- ఏ దురుద్దేశమూ కడుపులో లేకపోతే ఇంటి ఆడపడుచు బరితెగించి షికార్లు చేస్తున్నప్పుడు కాళ్లిరగ్గొట్టక కళ్లు మూసుకుని ఇప్పుడు ఇంటిమీదకి దొమ్మీకి రావటంలో మీ ఉదేశ్యమేమిటి? ఇలా ఎంత మంది ఇళ్లమీదికెళ్లారు" అన్నారు వ్యంగ్యంగా!

పెద్దతనిలో కాస్త సమరస భావం అవుపిస్తోంది. కానీ చిన్నతను చాలా దూకుడుగా మాట్లాడుతున్నాడు.

"ఇప్పటిదాకా గౌరవమిచ్చే మాట్లాడామండీ. ఇంత వినీ మీరు నిజమెంతా అని ముందూ వెనకా విచారించకుండానే మీవాడు పత్తిత్తని బూకరిస్తోంటే ఇక మర్యాద తప్పక తప్పట్లేదు. ఇన్ని మాటలెందుకు మీ వాణ్ని పిలవండి. అతని చేతే ఒప్పిస్తాం అంటే ఏదేదో చెప్తారేమిటి?" నిగ్గదీస్తున్నాడతను.

"వాడు లేడయ్యా- ఉన్నారాడు. వాడికీ మీ చెల్లెలికీ ఏ సంబంధమూ లేనప్పుడు వాడు వచ్చే అవసరమేమిటసలు?" మొండి తనం చూపిస్తున్నారు మావారు.

"ఏ సంబంధమూలేదని మీరంటే సరిపోతుందా? దాని దారినది కాలేజీకి పోయే పిల్లని దారికాచి వెంటబడి దాని దృష్టి మళ్లించిందెవరు? ఇల్లు, చదువు తప్ప లోకమెరుగని దాన్ని మా కన్నుగప్పిమరీ మాయమాటలతో పార్కులకీ, సినిమాలకీ తిప్పిందెవరు? అమాయకురాల్ని చేసి ప్రేమా దోమా అంటూ ముగ్గులోకి దింపి నాశనం చేసిందెవరు? మీ కొడుకునొచ్చి తనుకాదని చెప్పమనండి చూద్దాం" ఆ చిన్నతను రెట్టించాడు.

"మూర్తిగారూ- మాటలు తిన్నగా రానివ్వండి" ఆ ఇద్దరూ కోరస్‌గా అరిచారు. ఆ వెంటనే పెద్దతను నిగ్రహించుకున్నాడుగానీ అతని తమ్ముడు అదే ఉద్రేకంతో ఊగుతూ, "నేను ముందే చెప్పానన్నయ్యా- మంచిగా చెప్తే వినేరోజులు కావివని. చూడు ఎలాటి మాటలు పడుతున్నామో. నువ్వింకేం మాట్లాడకు. ఆ రాస్కెల్ ఇంట్లోనే ఉండుంటాడు. ఈయనన్నడిగే దేమిటి. లోపలికెళ్లి లాక్కొస్తానుచూడు." అని ముందుకురికాడు.

"ఏమిటీ నా అనుమతి లేకుండా నా ఇంట్లోకి జొరబడ్డానికి నీకెంత ధైర్యం! ఉండు. పోలీస్ రిపోర్టిస్తాను. నిన్నులాకప్పులో పెట్టిస్తాను." మావారు ఉగ్రంగా రంకెలేస్తున్నారు.

నాకు విషయం అర్థమయింది.

మావాడు ఎవరో అమ్మాయిని వెంటేసుకు తిరుగుతున్నట్టు నీలి వార్తలు ఇదివరకే విన్నాం. ఒకరిద్దరు తెలిసినవాళ్లు చూసి మావార్ని హెచ్చరించటమూ, నేనూ ఆయన మా వాణ్ని మందలించటమూ కూడా జరిగేయి. అయితే ఇంత ఎడ్వాన్సయిన సంగతి మాత్రం ఊహించని మాట వాస్తవమే.

కానీ ఈయనేమిటిలా అసలేమీ తెలీనట్టు దబాయిస్తారు !

నిన్నగాక మొన్న నేరమూ శిక్ష అన్న అంశం మీద బ్రహ్మాండమైన నిర్వచనమిచ్చిన పెద్దమనిషి ఈ రోజు ఇలా ప్లేటు ఫిరాయించటమేమిటి?

నేరాన్ని క్షమించటమంటే నేరాన్ని ప్రోత్సహించటమేనని నిర్ద్వంద్వంగా సెలవిచ్చిన మహానుభావులేనా ఇప్పుడిలా నేరస్థుడైన కొడుకుని రెక్కలకింద ముయ్యాలని ప్రయత్నించేది?

ఎదుటి వారికి వర్తింపజేసిన కఠినమైన న్యాయం సమయమొచ్చినప్పుడు తనకే వర్తిస్తుందని ఆయనకు తెలీదా?

నా మనసు చేదు తిన్నట్టు వెగటుగా అయింది.

ఏదో ఉద్వేగం నన్నావహించగా చరాలున పడగ దిలోకి వెళ్లాను. కప్పుకున్న రగ్గులాగిపడేశాను. రెక్కపట్టుకుని బయటకు లాక్కు వచ్చాను మా పెద్దాణ్ని.

"అపరాధి ఇదుగో. ఏ తీర్పు అమలు పర్చుకుంటారో మీ ఇష్టం" అన్నదమ్ముల ముందుకు తోశాను.

"ఏమిటి నువ్వు చేస్తోంది- మతిగానీ పోయిందా?" నన్ను మింగేసేలా చూస్తూ కంగారుగా అరిచారు మాశ్రీవారు.

చూపులు తిప్పుకున్నాను నేను.

"మతి నాకు పోలేదు. ఒక రోజు నేరస్తుణ్ని శిక్షించాల్సిందే. చీల్చిచండాడాల్సిందే. లేకపోతే ఇంకా పాపపునులు చేసి చెడిపోతాడని హితబోధ చేసింది మీరే. మీరు మాటల్లో చెప్పినదాన్నే నేను చేతల్లో పెట్టి మీకు సహకరించానంతే."

అవాక్కయ్యారు అందరూ.

ఆ తరవాత మా ఇంట్లో జరిగిన సంగ్రామం తాలూకు భీభత్సాన్ని ఇక్కడ ఉటంకించ పనిలేదు.

★ ★ ★

ఒక మంచి రోజున మా పెద్దాడు ఆపిల్ల చిటికెన వేలు పట్టుకుని మా గుమ్మంమెట్లు ఎక్కాడు. నేను వాళ్లకి హారతివ్వబోతూ అప్రయత్నంగా గోడ వారంటు పాతిన గులాబి కొమ్మల వంక చూశాను.

అవి నిండా చిగుళ్లు పెట్టి ఉన్నాయి.